# టీ వీ సిన్మాయణం

—డాక్టర్ భానుమతీ రామకృష్ణ



**ఈ మధ్య తెలిసిన వాళ్ళింటికి ఏదో 'ఫంక్షన్'కి వెళ్ళాల్సి వచ్చింది. పాట కచ్చేరీ గూడా పెట్టారు.**

**ఫంక్షన్‌కీ కచ్చేరీ వినడానికీ వచ్చిన ఆడవాళ్ళు కూడా తీసుకొచ్చిన పిల్లల్ని సముదాయించి కుదురుగా కూర్చోబెట్టడానికి సతమతమవడం కనిపించింది!**

మొండిగా మారాం చేస్తున్న పిల్లల్ని చూసి "ఏం కావాల్రా మీకూ!" అని అడిగింది ఆ ఫంక్షన్ జరిపే ఆ ఇంటి యజమానురాలు!

"టీ.వీ. చూస్తారట! మీ ఇంట్లోకెళ్ళి! ఫంక్షన్‌కొచ్చి బుద్ధిగా కూర్చోకుండా చూడండీ పిల్లలూ!" అన్నారు ఆ పిల్లల తల్లులు కోరస్‌గా!

"చిన్న పిల్లలకి పాట కచ్చేరీ వినాలని వుండదండీ! యీ కాలం పిల్లలకి ఆ టి.వి. చూడాలనే వుంటుంది. పోయి చూడనివ్వండి పాపం! పొండ్రా! వెళ్ళి లోపల టి.వి. ఆన్‌చేసి చూస్తూ కూర్చోండి! అందులో వచ్చే పాటలకి మీరు డాన్స్ చేయండి! ఈ మధ్య టి.వి. ఆన్‌చేస్తే పిల్లలు కూర్చొని చూట్టం లేదే! ఆ టి.వి. సిన్మాలో వచ్చే హీరోల్తోబాటు వీళ్ళూ స్టెప్స్ వేస్తున్నారే!"

"వెళ్ళండ్రా! ఏదో తెలుగు సినిమానే యీ 'టైమ్'లో టి.వి.లో వస్తూంటుంది. వెళ్ళి చూడండి. మద్రాసులో వుండేవాళ్ళకు తెలుగు సినిమాలు చూసే అదృష్టం లేకుండా పోయి చాలాకాలం అయింది. కనీసం టి.వి.లో నైనా ఎప్పుడో ఒకసారి చూసే అవకాశం కలిగింది! వెళ్ళి చూడండి" అని ఆ యిల్లుగలావిడ అనగానే పిల్లలంతా 'హే' అంటూ గోలగా సంతోషంతో కేకలేస్తూ లోపలికి పరుగెత్తారు.

పాటకచ్చేరీ వింటూ మధ్య మధ్య పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న నా పక్కనున్న అమ్మలక్కల దగ్గరికి టి.వి. చూట్టానికి లోపలికెళ్ళిన పిల్లల్లో ఒక పదేళ్ళ పిల్ల ఏడుస్తూ పరుగెత్తుకొచ్చింది.

"ఏం జరిగిందమ్మా" అని వాళ్ళమ్మగారడిగితే వెక్కి వెక్కి ఏడుస్తుందేగాని జవాబు చెప్పలేదాపిల్ల.

"నే చెప్తానండీ!" అంటూ లోపల్నుంచి మరో పదేళ్ళ పిల్లాడు పరుగెత్తుకొచ్చాడు.

"ఏంట్రా! ఏం జరిగింది! మా అమ్మాయి ఎందుకేడుస్తూంది!" అని అడిగిందా ఏడ్చేపిల్ల తల్లి ఆదుర్దాగా.

"మరే! మరే! ఆ జగ్గూగాడు ఒట్టి రౌడీ అండీ! చూడండీ నా చొక్కా ఎలా చించేశాడో!"

"నీ చొక్కా చించితే మా అమ్మాయి ఎందుకేడుస్తుందిరా! నీవు చెప్పిన ఆ రౌడీ వెధవ మా అమ్మాయి నేమన్నా కొట్టాడా!" అని అడిగింది పిల్ల తల్లి.

"కొట్టలేదుగానండీ! మరే, మరే! ఆ టి.వీ. సిన్మాలోనండీ ఎవరో ఒకమ్మాయీ, మరే, స్నానం చేస్తుంటే ఆ సిన్మాలో విలన్ ఆ అమ్మాయిని రేప్ చెయ్యబోతాడండీ! మరే ఆ అమ్మాయిని యింకెవరో వచ్చి కాపాడబోతే వాళ్ళని ఆ సిన్మా విలన్



చితక తంతాడండీ! మరే, మరే..."

"నీ మరే మండ! అసలేం జరిగిందో, మా అమ్మాయి ఎందుకేడుస్తోందో త్వరగా చెప్పి ఏడవరా!" అన్నది ఓర్పు నశించిన పిల్ల తల్లి.

"మరేండీ! మరే! ఆ సీను చూస్తున్న మా క్లాస్ రౌడీ కుర్రాడు జగ్గారావు లేడండీ! వాడే, మరే, వాడిపక్కనే నిలబడి టి.వి. చూస్తున్న మీ అమ్మాయిని 'సడన్'గా చెయ్యి పట్టుకుని లాగి కిందపడేశాడండీ! ఆ సిన్మాలో విలన్‌లాగా."


"నేను ఈ పేటకు రౌడీని! నాకడ్డొచ్చిన వాళ్ళను సఫాచేసి పారేస్తాను-హహహ! అంటూ ఆ సిన్మా విలన్‌లాగే యాక్షన్ చేశాడండీ!"

" కిందపడి ఏడుస్తున్న మీ అమ్మాయిని నేను వెళ్ళి లేవదీయబోతే, నన్ను తన్ని, నా చొక్కా చించేశాడండీ! వాడొట్టి రౌడీ ఎదవండీ!" అని కుర్రాడు చెప్తూంటే, మేమంతా దిగ్భ్రాంతి చెంది నోళ్ళు తెరుచుకుని విన్నాం.

"ఇంకేం చదువుతారు పిల్లలు! టి.వి.లో దృశ్యాలే పిల్లల బుర్రల్లో పనిచేస్తుంటే చదువు బుర్రకెలా ఎక్కుతుంది! ఈ పిల్లల భవిష్యత్తు గల్లేవౌతుందోగదా! రేప్ అనే మాటకు అర్థం తెలీని వయసులో వాళ్ళు అలాంటి దృశ్యాలు చూడడమే కాకుండా, ఆ దృశ్యాలను గురించి సర్వ సాధారణంగా మాట్లాడుతున్నారే! ఇంత చిన్న వయసులో మాట్లాడ్డమేగాక అనుసరించడానికి ప్రయత్నిస్తున్నారే! ఎంత ఘోరం!" అంటూ అది విన్న ఆడవాళ్ళంతా దవడలు నొక్కుకున్నారు.

"రాస్కెల్! వేలెడు లేడు! యీ వయసులోనే ఆ గాడిదకిన్ని పాడు బుద్ధులా! ఉండు వాడికి కాస్త దేహశుద్ధి చేస్తేగాని వాడి తిక్క కుదర్దు!" అంటూ ఏడ్చేపిల్ల తల్లి కోపంతో విసవిస లోపలికెళ్ళి, జగ్గుగాడి చొక్కా పట్టుకుని బట బట బయటికి లాక్కొచ్చి వాలుగు తగిలించిందా ఏడ్చే పిల్ల తల్లి! కాసేపు కచ్చేరీలో కలకలం! యీలోగా అక్కడికి వచ్చిన జగ్గారావు తండ్రిగూడా అంతా విని మరి నాలుగు అంటించాడు కొడుక్కి!

"నాకేం తెలీదు! మీ అమ్మాయిని కావాలని కిందపడేయలేదు! ఆ టి.వి. సిన్మాలో విలన్ లాగా యాక్షన్ చేశాను. అంతే" అంటూ జగ్గూ ఏడుపు లంకించుకున్నాడు. వాడిమీద జాలిపడ్డ ఒకావిడ "చిన్నపిల్లలు వాళ్ళ నెందుకండీ అనడం! అలాంటి సిన్మాలు తీసేవాళ్ళనీ, అభంశుభం తెలీని యీ పిల్లలకు అలాంటి సిన్మాలు చూపించే వాళ్ళనీ అనాలి! మరీ రాను రాను సినిమాల్లో ఆడదాన్ని ఎంత అన్యాయంగా చూపిస్తున్నారో చెప్పడానికి లేదు! అబ్బబ్బ! ఆడది కనిపిస్తే వెంటబడి దాన్ని నానా అల్లరి పెట్టి అవమానకరమైన, అసభ్యకరమైన డబుల్‌మీనింగ్ డైలాగులు చెప్పి ఆటబొమ్మని చేసి ఆడదాన్ని ఘోరంగా అవమానిస్తున్నారీనాటి సినిమాల్లో! వాళ్ళకీ ఒక తల్లీ, తోబుట్టువూ, పెళ్ళామూ, వున్నారనీ, వాళ్ళనీవిధంగా మరొకరు అవమానిస్తే ఎలా వుంటుందో యిలాంటి సిన్మాలు చూపించేవారెప్పుడైనా ఒక్క క్షణం ఆలోచించారా అని నా సందేహం" అంటూ అక్కడున్నవాళ్ళల్లో ఒకామె ఆవేశంతో లెక్చరిచ్చేసింది సినిమావాళ్ళని దుయ్యబడుతూ. అది విన్న ఒక పెద్ద ముత్తైదువ "బాగా చెప్పావు తల్లీ. అసలు ఒకప్పుడు పాత సినిమాలలో హీరోయిన్ కాలేజీకో ఎక్కడకో పోతూంటే ఏ రౌడీ కుర్రాడో వెంటబడి ఆ పిల్లని ఏడిపించి గోలచేస్తూంటే మరో మంచి కుర్రాడు వచ్చి ఆ రౌడీ విలన్‌కి తగిన బుద్ధిచెప్పి, ఆ పిల్లని కాపాడేవాడు! అతడే హీరో ఆవాడు! తనను కాపాడిన ఆ పిల్లవాడిని ప్రేమించేదే హీరోయిన్. కాని యీనాటి సిన్మాల్లో హీరోయిన్ని అల్లరి పెట్టడానికి ఏ రౌడీకీ ఛాన్సు యివ్వకుండా హీరో అనబడేవాడే పెద్ద రౌడీగా తయారై మరో పది మంది రౌడీలతో హీరోయిన్ దారికడ్డు తగలడమే కాకుండా ఆ పిల్ల వేసుకున్న జానాబెత్తెడు స్కర్టు పట్టి లాగి, దాని జుట్టుపీకి, కాళ్ళు పట్టుకు యీడ్చి, ఆ పిల్లని నానా




చిత్ర హింసలు పెట్టడం చూస్తున్నాం. అయినా యీనాటి హీరోయిన్ ఆ రౌడీ హీరోనే ప్రేమిస్తోంది ఖర్మ! అలాంటి హీరోయిన్ సినిమాల్లో కష్టాలు పడ్డట్టు చూపించినా మనకి కండ్లు చెమ్మగిల్లడం లేదు. దానికి మరో కారణం గూడా వుందిలెండి."

"పిన్నీ! ఒకనాడు హీరోయిన్‌కి మడమలు కనిపించకుండా పావడానో, లేక పైజామానో (పంజాబీ డ్రస్) వేసేవారు ఆయా పాత్రలని బట్టి. యీనాటి హీరోయిన్ డ్రస్సేమిటో అయోమయం గదా! జానా బెత్తెడు స్కర్టంట! తొడలు కనిపించేలా వేసుకుని కాలేజీకి వెళ్తున్నట్టు చూపిస్తే మరి కుర్రాళ్ళు వెంటబడతారంటే పడరూ!" అన్నది. మరొకావిడ దీర్ఘంతీస్తూ-"మరీ హిందీ సిన్మాలు టి.విలో వచ్చేవి మీరు చెప్పిన బెత్తెడు స్కర్టులోనే కనిపిస్తున్నారు అన్యాయం. ఆ లక్షణంలో ఎగిరెగిరి డాన్సు వేరే విరగబడిపోతూ! అబ్బబ్బ ఎందుకు చెప్తాలెండి! కళ్ళు మూసుకుని చూస్తున్నాం."

"మరి యీలాంటి సిన్మాలు యీనాటి కుర్రకారు చూసి చెడిపోతున్నారంటే చెడిపోరూ! "

"తల్లిదండ్రులే అసలు యిలాంటి సిన్మాలు టి.వి.లో వచ్చే టైముచూసి పిల్లల్ని కట్టుబాటు చేసి చదువులో పడేయాలి-ఏమంటారు పిన్నిగారూ!"

"ఆ అసలు మా యింట్లో టి.వి.నే ఆన్ చేయడం మానేశాం! పిల్లలడిగితే చెడిపోయిందని చెప్పేస్తున్నాం! "

"ఆ! మీ వెర్రిగానీ అంటే! ఎంతకాలం చెప్తారు తెలీకడుగుతా! యీనాడు ప్రతి యింట్లోనూ టి.వి. వుంది. మీ ఇంట్లో చెడిపోతే పక్కింటి స్నేహితుల యింటికెళ్ళి చూస్తారు. ఒకప్పుడైతే ప్రేమ సన్నివేశాలెక్కువగా వుండే పిక్చర్లు వస్తే పిల్లల్ని సినిమా హాలుకు తీసుకు వెళ్ళకుండా పెద్ద వాళ్ళు మాత్రం చూసి వచ్చేవారు. యింట్లో టి.వి. యీనాడు ప్రతి యింట్లో టి.వి. ప్రత్యక్షమైంది. అందులోనూ విదేశాల్లోలాగే జుల్లై 'ఛానల్స్' వచ్చాయి. ఏ ఛానల్ ఆన్ చేసినా అవే డాన్సులు అవే సిన్మాలు. ఛస్తామా!" అన్నది ఫారిన్ నుంచి వచ్చిన ఒక మహిళ.

"లాభం లేదు! యిది ఫారెస్ట్ ఫైర్‌లాగా తయారయింది. యీనాటి యంగర్ జనరేషన్‌ని యీ టి.వి. లో వచ్చే సీన్లూ సిన్మాలూ, పాటలూ, డిస్ట్రక్టివ్ పాత్‌లోకి తీసుకు వెళ్తేట్టున్నాయి. కమర్షియల్ దృష్టితో తీసే ఆ సిన్మాలు చూసేబదులు ఏవైనా మంచి సీరియల్స్ వస్తే చూడడం మంచిది. నీతి [illegible]

"టి.వి.లో [illegible] వస్తాయే హాయిగా రామాయణం భారతం! అవి చూస్తుంటే యింక ఏదీ చూడబుద్ధెయ్యలేదే! అన్నీ అలాంటివే టి.వి.లో వస్తే ఎంత బాగుంటుందో!"

"పిల్లలకోసం గూడా ఎన్నో పిట్టకథలు విజ్ఞాన వికాసాలు కలిగించే మంచి పురాణ కథలూ లేవూ తీయాలంటే! ఓపిగ్గా వెతికి పట్టుకోవాలి! టి.వి. వాళ్ళకు దయకలిగి అలాంటి వాటికి అనుమతి యిచ్చి తీయిస్తే అవి చూసి పిల్లలూ పెద్దలూ గూడా బాగుపడతారు."

"ఏమ్మా! మీరూ సినిమాలు తీశారూ, చేశారు! మీరూ చక్కటి టి.వి. సీరియల్స్ అందరం నవ్వుకుంటూ ఆనందించేవి తీయగూడదూ!" అంటూ అమ్మలక్కలంతా నా వైపు తిరిగారు సడన్‌గా! నా గుండె గతుక్కుమన్నది నాకూ నాలుగక్షింతలు వేస్తారేమోనని.

"పైగా మీరు హాస్యం బాగా రాస్తారు! ఎంచక్కా తీయచ్చే!" అన్నది ఒకావిడ నా భుజం పట్టుకుని ఊపుతూ.

"అలాగే తీయొచ్చు! తీస్తాము తప్పకుండా" అంటూ చటుక్కున లేచాను కచ్చేరీ పూర్తయిన మృదంగం ముక్తాయింపువిని.